క్లుప్తంగా

సీడీసీ చైర్మన్ లీలాప్రసాద్‌కు పరామర్శ

నేలకొండపల్లి: చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. మండలంలోని మంగ్రాజుపల్లిలో లీలాప్రసాద్ నివాసానికి వచ్చిన ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆ తర్వాత మంగ్రాజుపల్లి కొత్తూరులో ఇటీవల మృతి చెందిన వెంకటరామారావు కుటుంబాన్ని కూడా ఎంపీ పరామర్శించారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావుతో పాటు సూరపనేని రామకృష్ణ, దండా పుల్లయ్య, నెల్లూరి అనురాధ, వజ్జా శ్రీనివాసరావు, మంకెన వెంకటేశ్వరరావు, షేక్ సోందుమియా, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణోత్సవాలు

తిరుమలాయపాలెం: మండల పరిధిలోని పాతర్లపాడు శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 3 నుంచి నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజున మహాపూర్ణాహుతి, చక్రస్నానం, దేవతోద్వాసన, ద్వాదశారాధన, పుష్పయాగం తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో వేదపండితులు కండ్లకుంట్ల వెంకటాచార్యులు, అర్చకులు ప్రతాపురం రవీంద్రాచార్యులు, మధుసూదనాచార్యులు, సర్పంచ్ తమిర రామ్మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జడల వెంకటనారాయణ, పనిరెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి

నేలకొండపల్లి: హైదరాబాద్‌లో సోమవారం జరిగే నిరుద్యోగ యువ సంఘర్షణతో ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. తెలంగాణ వచ్చిన తరువాత కేసీఆర్ హయాంలో నిరుద్యోగ సమస్య తీవ్రమైందన్నారు. కేసీఆర్ లాంటి నియంతను గద్దె దించేందుకు నిరుద్యోగులు కదలిరావాలని పిలుపునిచ్చారు. యువత, నిరుద్యోగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ సర్కార్‌కు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి రావటం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో యడవల్లి నాగరాజు, యాతాకుల శ్రీనాథ్, సూరేపల్లి రవి పాల్గొన్నారు.

త్వరలోనే ఇళ్ల ప్లాట్లు ఇప్పిస్తాం..

ఖమ్మంసహకారనగర్: త్వరలోనే ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఇళ్ల ప్లాట్లు ఇప్పిస్తామని హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ఎండీ సలీం తెలిపారు. ఆదివారం తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం సంఘం భవనంలో ఎండీ అబ్దుల్ హకీమ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా డ్రైవర్ల సంఘం గౌరవ సలహాదారుడు కె.కోటేశ్వరరావు, హౌస్ బిల్డింగ్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు మామిడి బాబూరావు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడారు. సమావేశంలో పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో దాసరి వేణుగోపాల్, వనమా శ్రీనివాసరావు, రాఘవులు, వి.నాగరాజు, ఎల్.గంగన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పీఎస్–2
వినోద	విరూపాక్ష
సాయిరాం	రామబాణం
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	ఏజెంట్
సుందర్	విద్యార్థి

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	22	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	50		10
కాకర	36	చుక్కకూర	2
బోడ కాకర	80		10
బీర	50	తోటకూర	2
దొండ	24		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	18		20
క్యాలీఫ్లవర్	20	కొత్తిమీర	1
ఆలుగడ్డ	22		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	40		15
బీన్స్	46	-ఖమ్మం వ్యవసాయం	

దర్జాగా దందా!

- యథేచ్ఛగా చెట్ల నరికివేత
- అనుమతులు లేకుండానే ఇటుక బట్టీలకు చేరవేత
- గ్రామాల నుంచి కట్టెల మిల్లులకు తరలింపు
- అడిగే వారు లేరని అడ్డగోలుగా రవాణా
- అడ్డుకట్ట వేయలేని అధికారులు
- దళారులను అడ్డుకోవాలని ప్రజల వేడుకోలు


ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న చెట్ల మొద్దులు

ఖమ్మంరూరల్: గ్రామాల్లో పచ్చని చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నరికి పట్టణాల్లో కట్టెల మిల్లులు, ఇటుక బట్టీలకు అక్రమ రవాణాదారులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. గ్రామాల్లోని పంటపొలాలు, బీడు భూముల్లో ఉన్న విలువైన చెట్లను నరికి తరలించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ పాలేరు నియోజకవర్గంలో కట్టెల రవాణాదారులు ఎటువంటి అనుమతి లేకుండా చెట్లను నరికేసి మిల్లులకు తరలిస్తున్నారు.

గ్రామాల నుంచి తరలింపు..

ఇదిలా ఉండగా ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల నుంచి పొలాలు, బీడు భూముల్లో ఉన్న రకరకాల చెట్లను నరికి కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లో గల సామిల్లులకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసం దాడులు చేసిన దాఖలాలే లేకపోవడంతో అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఎవరో ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల మెప్పు పొందడానికి తూతూమంత్రంగా దాడులు చేస్తున్నారే తప్ప అక్రమ రవాణాను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవడంలేదు. వాస్తవంగా అటవీశాఖ అధికారుల అనుమతితో పాటు సంబంధిత గ్రామపంచాయతీ నుంచి సర్టిఫై చేయాల్సి ఉంటుంది. ఆచరణలో మాత్రం రవాణాదారులు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్నారు.

ఇటుక బట్టీలకు వందల ట్రిప్పులు..

బట్టీల్లో ఇటుకలను కాల్చడానికి కలప తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. దీంతో అడ్డగోలుగా చెట్లను నరికి రూరల్ మండలంలోని పల్లెగూడెం, ఎంవెంకటాయపాలెం, కాచిరాజుగూడెం, గొల్లగూడెం, గుదిమళ్ల, తిరుమలాయపాలెం మండలం బచ్చోడు, కాకరవాయిలో గల ఇటుక బట్టీలకు రేయింబవళ్లు కలపను తరలిస్తున్నారు. అటవీచట్టం ప్రకారం చింతచెట్లు, మోదుగు చెట్లను నరికి తరలిస్తే కఠినమైన చర్యలు ఉంటాయి. అయినా అన్ని రకాల చెట్లను నరికి ఇటుక బట్టీలు, సామిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేలుకోకపోతే పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లడంతో పాటు చెట్లు అంతరించి పోయే ప్రమాదముంది.

చట్టం ఉన్నా లేనట్టే..

కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వాల్టా చట్టం తీసుకొచ్చింది. పర్యావరణానికి నష్టం కలగకుండా చట్టరీత్యా అనుమతులు పొందిన తర్వాతే చెట్లు, మట్టి, ఇసుకను తరలించాల్సి ఉంటుంది. కానీ ఇవేవీ పట్టించుకోకుండా జంకూ బొంకూ లేకుండా చెట్లను నరికి తరలిస్తున్నారు. అయితే ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు, పర్యావరణాన్ని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ దందాను అధికారులు అడ్డుకోకుండా వారిని మచ్చిక చేసుకొని వాల్టా చట్టాన్ని తమకు అనుకూలంగా మలుచుకుని దళారులు రెచ్చిపోతున్నారు. దీంతో చెట్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ఒకనైనా అధికారులు స్పందించి దందాను అడ్డుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

మెరుగైన వైద్యం కోసమే పల్లె దవాఖానాలు

- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- మంచుకొండ పీహెచ్‌సీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


మంచుకొండ పీహెచ్‌సీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అజయ్‌కుమార్


చెక్కు అందజేస్తున్న మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం: అన్ని ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం బస్తీ, పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణలో విద్య, వైద్యరంగాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. మండలంలోని మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.24 లక్షలతో చేపట్టే పనులకు ఆదివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఒక వైపు కంటి వెలుగు, మరో వైపు ఆరోగ్య మహిళ పథకాల ద్వారా అందరికీ మెరుగైన వైద్యం అందుతోందని చెప్పారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పిస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పంగిడిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. కాగా, ఖమ్మం, రఘునాథపాలెంలో క్రిస్టియన్లకు ఉపయోగపడేలా ప్రభుత్వం ద్వారా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జిల్లా మహాసేన పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు మంద సంజీవరావు, ఐకేపీలోని వీఓఏల సమస్యలు పరిష్కరించాలని రఘునాథపాలెం మండల ఐకేపీ అధ్యక్షురాలు కూరపాటి విజయకుమారి తదితరులు మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమాల్లో డీఎంహెచ్‌ఓ మాలతి, మంచుకొండ వైద్యాధికారి సంధ్యారాణి, సర్పంచ్‌లు వాంకుడోత్ విజయదీపక్, మంగీలాల్, చెరుకూరి ప్రదీప్, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌తో పాటు భూక్యా లక్ష్మణ్‌నాయక్, మందడపు సుధాకర్, అజ్మీరా వీరూనాయక్, మందడపు మాధవరావు, మందడపు నర్సింహారావు, కుర్రా భాస్కరరావు, రాణి, రమేష్, భిక్షం, సైదులు, లక్ష్మా, లింగా, విజయరావు, సంజీవరావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకున్న 116 మందికి మంజూరైన రూ.42.69 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అందజేశారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలు వైద్యం కోసం ఇబ్బంది పడొద్దనే భావనతో సీఎం కేసీఆర్ ఈపథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. కాగా, ఉపాధి హామీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కూడా మంత్రి మాట్లాడారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎ.లింగయ్యతో పాటు విజయ్, వెంకట్రాంరెడ్డి, మోహన్‌రావు, రఘు, జలీల్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉద్యమ ఫలాలన్నీ కేసీఆర్ కుటుంబానికే..


సమావేశంలో మాట్లాడుతున్న జావీద్

ఖమ్మంసహకారనగర్: నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా సాధించుకున్న తెలంగాణలో ఫలాలన్నీ సీఎం కేసీఆర్ కుటుంబానికే పరిమితమయ్యాయని పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావేద్ ఆరోపించారు. డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటిస్తే కల్లబొల్లి మాటలతో అధికారం చేపట్టిన కేసీఆర్ నిరుద్యోగులు, యువత, విద్యార్థులకు ఏంచేయలేదని విమర్శించారు. ఈ నేపథ్యాన కాంగ్రెస్ ఆధ్వర్యాన హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఈ నెల 8న నిర్వహిస్తున్న సభకు నాయకులు, కార్యకర్తలతో పాటు తరలిరావాలని జావేద్ కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు సైదులునాయక్, వెంకటేశ్వర్లు, భారతి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే


నేలకొండపల్లి: వీరబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: మండలంలోని మంగళిబండతండాలో ఆదివారం నిర్వహించిన ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు స్వాగతం పలకగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఎమ్మెల్యే రూ.5 లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కందాల విస్తృత పర్యటన

నేలకొండపల్లి: పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఆదివారం మండలంలో పర్యటించారు. పైనంపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డ్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మారగాని వీరబాబును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పిడమర్తి అఖిల్‌ను పరామర్శించారు. అనంతరం నేలకొండపల్లిలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. నాగుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ఖమ్మంరూరల్: మండలంలోని పోలిశెట్టిగూడెంలో నూతనంగా నిర్మించనున్న సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మంగళగూడెం, కొత్తూరు గ్రామాల్లో వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బెల్లం వేణు, పుల్లయ్య, ఉపేందర్, ఎస్.వరప్రసాద్ పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి


సంఘీభావం తెలుపుతున్న సర్పంచ్

నేలకొండపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించాలని సర్పంచ్‌ల సంఘం మండల ఉపాధ్యక్షురాలు పెంటమళ్ల పుల్లమ్మ కోరారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యదర్శులు చేపడుతున్న శిబిరాన్ని ఆదివారం ఆమె సందర్శించి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. పది రోజులుగా ఆందోళన చేస్తున్నారని, ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కస్తాల గోపయ్య, బైరం దినేశ్‌కుమార్, ప్రసాద్, మహేశ్, ఇబ్రహీం, రజిత, బోళ్ల వీరబాబు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మందడపు శ్రీనివాసరెడ్డికి నివాళులు


నివాళులర్పిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 16వ డివిజన్ ధంసలాపురంలో మందడపు శ్రీనివాసరెడ్డి సంతాప కార్యక్రమంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు మందడపు శ్రీనివాసరెడ్డి భార్య నాగమణి, కుమార్తె మానస, అల్లుడు నిరంజన్‌రెడ్డి, కుమారుడు లక్ష్మణ్‌రెడ్డిని ఓదార్చారు. బ్రహ్మారెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బాలకోటిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, భూపతిరెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిమ్మపుడిలో లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. 5 రోజులుగా వైభవంగా నిర్వహించిన కార్యక్రమాలు ఆదివారం స్వామి వారి రథోత్సవంతో ముగిసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లతో స్వాగతం..


కోనాయిగూడెం నుంచి కూసుమంచి వెళ్లే రోడ్డుకిరువైపులా పచ్చని చెట్లు

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెం గ్రామపంచాయతీలోకి పచ్చని చెట్లు స్వాగతం పలుకుతున్నాయి. నేలకొండపల్లి మండలం నుంచి కూసుమంచి మండలానికి వెళ్లే ప్రధాన మార్గంలో ఇరువైపులా పచ్చని చెట్లు కనువిందు చేస్తున్నాయి. గతంలో నాటిన మొక్కలు పెద్ద వృక్షాలు మారాయి. హరితహారం కింద గ్రామ పంచాయతీ ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు చెట్లుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రహదారి వైపు వెళ్లే ప్రయాణికులు చెట్ల వద్ద కాసేపు ఆగి.. సెల్ఫీలు తీసుకుని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: డీవైఎఫ్ఐ జాతీయ కమిటీ సమావేశాలు ఈ నెల 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్నాయని, ఈ సమావేశాల్లో సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ కోరారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ కమిటీ సమావేశాలు మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతాయన్నారు. ఈ సమావేశాల్లో దేశవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు హాజరై పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు చింతల రమేష్, శీలం వీరబాబు, కొంగర నవీన్, కనపర్తి గిరి, కూరపాటి శ్రీను, రామిశెట్టి సురేష్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంమామిళ్లగూడెం: దళితరత్న అవార్డు గ్రహీత, మాదిగ హక్కుల దండోర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్‌మాదిగకు స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. మాదిగల హక్కుల కోసం చివరివరకు పోరాటం చేస్తానని తెలిపారు. అందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రాజ్, శ్రీనివాసరావు, లింగాల రవికుమార్, కనకయ్య, దయానంద్, ఎల్లయ్య, ప్రసాద్, కనకరాజు, రామారావు, ఊర్శిగౌడ్, మధు, రమేష్, విజయ్, నాగేశ్వరరావు, వెంకయ్య, సతీష్, నర్సింహారావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


పరీక్షలు నిర్వహిస్తున్న సునీల్‌కుమార్

ఖమ్మంవైద్యవిభాగం: జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఖమ్మం మయూరిసెంటర్‌లోని సాయిరాం గ్యాస్ట్రో లివర్ ఆస్పత్రిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ జంగాల సునీల్‌కుమార్ ఆధ్వర్యాన లివర్ ఫైబ్రోస్కానింగ్, హెపటైటిస్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో 80 మందికి స్క్రీనింగ్ టెస్టులు చేయగా, ఆరుగురికి హెపటైటిస్ పాజిటీవ్ ఉన్నట్లు గుర్తించారు. కాగా, తమ ఫౌండేషన్ ద్వారా ప్రతీ నెల మొదటి, మూడో ఆదివారం వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు జంగాల శ్రీధర్ వెల్లడించారు.

అదృష్టం ఉంటేనే ఉమ్రా యాత్ర సాధ్యం


మాట్లాడుతున్న ముఫ్తీ ఆసిఫ్ అలీ

ఖమ్మంమామిళ్లగూడెం: మానవ జీవితంలో ఒక్కసారైనా ఉమ్రా యాత్ర చేయాలని, అదృష్టం ఉంటేనే ఉమ్రా యాత్ర సాధ్యమని ముఫ్తీ ఆసిఫ్ అలీ, తవాఫ్ టూర్ ట్రావెల్స్ హజ్ అండ్ ఉమ్రా సర్వీసెస్ నిర్వాహకులు హఫీజ్ జవ్వాద్ అహ్మద్ అన్నారు. ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్న బృందానికి గొల్లగూడెంలోని ఇదారా తాలిం ఇస్లామియా ట్రస్ట్ మదర్సాలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యాత్రికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 10న సాయంత్రం 6.45 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రమం ద్వారా వెళ్లే విమానంతో వారి ఉమ్రా యాత్ర ప్రారంభమవుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జ్ ముఫ్తీ అబ్దుల్ రవూఫ్, ఉమ్రా యాత్రికులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యంతోనే అభివృద్ధి సాధ్యం


బహిరంగసభకు బయలుదేరుతున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: బహుజన రాజ్యాంతోనే బహుజనుల అభివృద్ధి సాధ్యమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అల్లిక వెంకటేశ్వరావు అన్నారు. హైదరాబాద్ తెలంగాణ భరోసాయాత్ర, మాయావతి బహిరంగ సభకు ఆదివారం ఖమ్మం నుంచి వాహనాల ద్వారా పలువురు బయలుదేరారు. వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా.. రూ.వేల కోట్ల కుంభకోణానికి పాల్పడి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు దామళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

పొద్దంతా ఆరబోత... సాయంత్రం కుప్ప!


సింగారెడ్డిపాలెంలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు


ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న రైతులు

నేలకొండపల్లి: ఈ ఏడాది యాసంగిలో వరి సాగు చేసిన రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ఆరుగాలం కష్టించి సాగు చేసిన వరి పంట చేతికందినా విక్రయించడంలో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. తరచుగా వర్షం కురుస్తుండడంతో కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. కాగా, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేయడం, మిల్లులకు తరలింపులో ఎడతెగని జాప్యం జరుగుతోంది. దీంతో ఉదయమంతా ధాన్యం ఆరబోస్తున్న రైతులు, వర్షం భయంతో సాయంత్రమయ్యే సరికి మళ్లీ కుప్పలు చేసి పట్టాలు కప్పుతున్నారు. పలు కేంద్రాల్లో ధాన్యం పోసి ఇరవై రోజులు దాటిన కాంటా వేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని రైతులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు

ఖమ్మంఅర్బన్: నగరంలోని పోలీసుకాలనీకి చెందిన వైద్యుడు చీదిళ్ల రోహిత్ ద్విచక్ర వాహనం చోరీ అయినట్లు చేసిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గత నెల 7వ తేదీన రోహిత్ అపార్ట్‌మెంట్ ఎదుట పార్కింగ్ చేసిన వాహనం మధ్యాహ్నం కల్లా కనిపించలేదు. దీంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో చోరీకి గురైనట్లు భావించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు వెల్లడించారు.